ఒకే ఒక్కడు..

మస్క్ సంపద 400 బిలియన్ డాలర్లపైనే • బ్లూంబర్గ్ తాజా నివేదిక

న్యూఢిల్లీ, డిసెంబర్ 12: అమెరికా బహుళజాతి ఆటోమోటివ్ దిగ్గజ సంస్థ టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ పేరిట నయా రికార్డు నమోదైంది. ఇప్పటికే ప్రపంచ కుబేరుడిగా విరాజిల్లుతున్న మస్క్.. ఓ అరుదైన ఘనతను సాధించారు. మస్క్ సంపద ఏకంగా 400 బిలియన్ డాలర్ల మార్కును దాటేసింది మరి. ఇప్పటిదాకా ఈ మైలురాయిని ఎవరూ అధిగమించలేదు. దీంతో ఈ రికార్డును సొంతం చేసుకున్న తొలి వ్యక్తిగా మస్క్ నిలిచారు. బ్లూంబర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ తాజా వివరాల ప్రకారం మస్క్ సంపద విలువ 447 బిలియన్ డాలర్లకు చేరింది.

ట్రంప్‌తో కిక్కు

ఇటీవలి అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించిన దగ్గర్నుంచి మస్క్ సంపద క్రమేణా పెరుగుతూపోతూనే ఉన్నది. ఎన్నికల్లో ట్రంప్ కోసం మస్క్ పనిచేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ట్రంప్ గెలుపు.. స్టాక్ మార్కెట్లలో మస్క్‌కు చెందిన కంపెనీల షేర్లకు విపరీతమైన ఊపును తెచ్చిపెట్టింది. ఇక టెస్లా, స్పేస్‌ఎక్స్ షేర్లలో ర్యాలీ మస్క్ సంపదను అంతకంతకూ పెంచేస్తున్నాయి. పెరిగిన డిమాండ్ నడుమ ఈ షేర్లను ఇన్వెస్టర్లు ఎగబడిమరీ కొనేస్తున్నారు. మస్క్ తన ప్రైవేట్ అంతరిక్ష్య అన్వేషణ సంస్థ స్పేస్‌ఎక్స్ షేర్లతో 50 బిలియన్ డాలర్ల సంపదను పెంచుకోగలిగారు. దీనంతటికీ ఇన్‌సైడర్ షేర్ సేల్ కారణమంటున్నారు. ప్రస్తుతం షేర్ ధర 135 డాలర్లదాకా ఉన్నది. ఇంకోవైపు టెస్లా షేర్ల విలువ ఆల్‌టైమ్ హైని తాకింది. ఒక్కో షేర్ 425 డాలర్లు పలుకుతున్నది.

బ్లూంబర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ జాబితా

- 165 బిలియన్ డాలర్ల సంపదతో 7వ స్థానంలో బిల్‌గేట్స్
- 144 బిలియన్ డాలర్లతో వారెన్ బఫెట్‌కు 10వ స్థానం
- టాప్-10 ప్రపంచ సంపన్నులలో 8మంది టెక్నాలజీ ఇండస్ట్రీకి చెందినవారే
- భారత్ నుంచి ముకేశ్ అంబానీకి 17వ స్థానం, గౌతమ్ అదానీకి 19వ స్థానం
- టాప్-50లో నలుగురు భారతీయులకు చోటు
- 10.1 బిలియన్ డాలర్లతో తెలుగు వ్యాపారవేత్త మురళీ దివీ

రెండు రోజుల్లోనే..

గత నెల రోజుల్లో దాదాపు 136 బిలియన్ డాలర్లు మస్క్ సంపద పెరగగా.. కేవలం రెండు రోజుల్లోనే 58 బిలియన్ డాలర్లు పుంజుకోవడం గమనార్హం. మంగళవారం నాటికి ప్రపంచ కుబేరుల జాబితాలో రెండో స్థానంలో ఉన్న జెఫ్ బెజోస్‌కు, మస్క్‌కు మధ్య సంపదలో తేడా 140 బిలియన్ డాలర్లే. కానీ గురువారం ఇది 198 బిలియన్ డాలర్లకు పెరిగింది. ప్రస్తుతం అమెజాన్ అధిపతి జెఫ్ బెజోస్ సంపద విలువ 249 బిలియన్ డాలర్లుగా ఉన్నది. ఇక తాజా జాబితా ప్రకారం టాప్-5లో నలుగురు అమెరికన్లే. ఒక్కరే ఫ్రాన్స్ (బెర్నార్డ్ ఆర్నాల్ట్)కు చెందినవారున్నారు. కాగా, గురువారం నాటికి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న టాప్-500 శ్రీమంతులతో ఈ జాబితాను బ్లూంబర్గ్ ఇచ్చింది. ఇందులో 26మంది భారతీయులున్నారు.

టాప్-5 ప్రపంచ కుబేరులు (బిలియన్ డాలర్లలో)

పేరు	సంపద
ఎలాన్ మస్క్	447
జెఫ్ బెజోస్	249
మార్క్ జుకర్‌బర్గ్	224
ల్యారీ ఎల్లీసన్	198
బెర్నార్డ్ ఆర్నాల్ట్	181

టాప్-5 భారతీయ సంపన్నులు (బిలియన్ డాలర్లలో)

పేరు	సంపద
ముకేశ్ అంబానీ	97.1
గౌతమ్ అదానీ	79.3
శివ్ నాడార్	43.9
షాపూర్ మిస్త్రీ	41.4
సావిత్రీ జిందాల్	34.7

ఆల్‌టైమ్ కనిష్ఠానికి రూపీ

84.88 వద్దకు పతనం • మరో 5 పైసలు క్షీణించిన విలువ

ముంబై, డిసెంబర్ 12: డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ అంతకంతకూ పడిపోతూనే ఉన్నది. గురువారం మరో 5 పైసలు దిగజారి ఫారెక్స్ మార్కెట్‌లో ఆల్‌టైమ్ కనిష్ఠాన్ని తాకుతూ 84.88 వద్దకు క్షీణించింది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరల్లో పెరుగుదల, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణలు, దేశీయ స్టాక్ మార్కెట్ల నష్టాలు.. రూపీని ఒత్తిడికి గురిచేశాయి. ఈ క్రమంలోనే విదేశీ బ్యాంకులు, దిగుమతిదారుల నుంచి డాలర్లకు భారీగా డిమాండ్ కనిపించింది. నిజానికి అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించిన దగ్గర్నుంచి కరెన్సీ మార్కెట్‌లో డాలర్ పరుగులు మొదలయ్యాయి. ఇదే సమయంలో ఇతర దేశాల కరెన్సీల పతనం కూడా ఆరంభమైంది. ముఖ్యంగా ఆసియా దేశాల్లోని అన్ని కరెన్సీల విలువ క్రమేణా పడిపోతున్నదని ఫారెక్స్ ట్రేడర్లు గుర్తుచేస్తున్నారు. బ్రిక్ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా) సభ్య దేశాలపై 100 శాతం సుంకాల పెంపు ఉంటుందని ట్రంప్ హెచ్చరించడమే కారణం అంటున్నారు.

మూడు రోజుల్లో 27 పైసలు..

గడిచిన 4 రోజుల్లో 3 రోజులూ రూపీ నష్టాలకే పరిమితమైంది. మిగతా ఆ ఒక్క రోజు ఎక్కడిదక్కడే ఉన్నది. ఇక ఈ మూడు రోజుల ట్రేడింగ్‌లో డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ 27 పైసలు కోల్పోవడం గమనార్హం. సోమవారం ఒక్క రోజే 20 పైసలు క్షీణించగా, బుధ, గురువారాల్లో మరో 7 పైసలు పతనమైంది. భారతీయ క్యాపిటల్ మార్కెట్ల నుంచి తరలిపోతున్న విదేశీ పెట్టుబడులు సైతం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నట్టు ఫారెక్స్ ట్రేడర్లు చెప్తున్నారు. మరోవైపు కరిగిపోతున్న దేశంలోని ఫారెక్స్ రిజర్వులు సైతం పరిస్థితుల్ని మరింతగా దిగజార్చుతున్నాయి. ఈ ఏడాది సెప్టెంబర్ 28న 704.885 బిలియన్ డాలర్లతో ఆల్‌టైమ్ హైలో ఉన్న ఫారెక్స్ రిజర్వులు.. గత నెల 22న 656.582 బిలియన్ డాలర్లకు క్షీణించాయి. దాదాపు రెండు నెలల్లో 48.30 బిలియన్ డాలర్లు హరించుకుపోయాయి.

ఇట్లయితే ఎదురు దెబ్బే

జీడీపీ వృద్ధిరేటు పతనం.. రూపాయి మారకం విలువ క్షీణత.. పెట్టుబడుల ఉపసంహరణలు.. దేశంలో ప్రమాద ఘంటికల్నే మోగిస్తున్నాయి. రూపాయి నష్టాలు.. దేశీయ దిగుమతుల్ని భారం చేస్తుండగా, ద్రవ్యోల్బణాన్ని కూడా ఎగదోస్తున్నది. ఇప్పటికే ఆర్బీఐ వడ్డీరేట్లను గరిష్ఠ స్థాయిల్లోనే ఉంచుతున్నది. ఇప్పుడు రూపీ తీరు.. ఇకపైనా వడ్డీరేట్ల కోతలకు వీల్లేకుండా చేస్తున్నది. ఇదే జరిగితే ఆయా రంగాల్లో వృద్ధి క్షీణించినట్లే.

టాటా కమర్షియల్ వాహనాలు ప్రియం

న్యూఢిల్లీ, డిసెంబర్ 12: దేశీయ ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన టాటా మోటర్స్ కూడా తన కమర్షియల్ వాహన ధరలను 2 శాతం వరకు పెంచబోతున్నట్లు ప్రకటించింది. జనవరి 1 నుంచి అమలులోకి వచ్చేలా అన్ని రకాల ట్రక్కులు, బస్సుల ధరలను సవరిస్తున్నట్లు తెలిపింది. ఉత్పత్తి వ్యయం పెరగడం వల్లనే వీటి ధరలు పెంచాల్సి వస్తున్నదని పేర్కొంది. ఆయా మాడళ్ల బట్టి బస్సులు, ట్రక్కులు మరింత ప్రియంకానున్నాయని వెల్లడించింది. ఇప్పటికే మారుతి, హ్యుందాయ్‌తోపాటు టాటా మోటర్స్, మెర్సిడెజ్ బెంజ్, బీఎండబ్ల్యూ, ఆడీ వాహన ధరలను పెంచుతున్నట్లు ప్రకటించాయి.

35% జీఎస్టీ వద్దు

కేంద్రానికి రిటైలర్ల విజ్ఞప్తి

న్యూఢిల్లీ, డిసెంబర్ 12: జీఎస్టీ రేట్లను హేతుబద్ధీకరించడంతోపాటు కొత్తగా పలు ఉత్పత్తులపై 35 శాతం జీఎస్టీ విధించే ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని దేశీయ రిటైలర్ అసోసియేషన్..కేంద్ర ఆర్థిక మంత్రి, జీఎస్టీ కౌన్సిల్‌కు సూచించింది. సిగరేట్లు, పొగాకుతోపాటు వాయు పానీయాలపై 35 శాతం జీఎస్టీని విధించాలని జీవోఎం ప్రతిపాధించింది. జీఎస్టీని మరింత సరళీకరించడంతోపాటు పన్నులను తగ్గించాలని ఇండియన్ సేల్లర్స్ అసోసియేషన్ రాసిన లేఖలో పేర్కొంది. దీనిపై వచ్చేవారం చివర్లో జరగనున్న జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నది.

సెన్‌హైజర్ నయా ఉత్పత్తులు

హైదరాబాద్, డిసెంబర్ 12: అత్యాధునిక ఆడియో, వీడియో టెక్నాలజీ ఉత్పత్తుల అందుబాటులోకి తెచ్చినట్లు ప్రముఖ ఆడియో టెక్నాలజీ అంతర్జాతీయ సంస్థ సెన్‌హైజర్ ప్రకటించింది. వీడియో కాన్ఫరెన్సింగ్ సొల్యుషన్స్ సంస్థ క్రెస్టాన్‌తో కలిసి వీటిని మార్కెట్లో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు, వీటి ధర రూ.3 లక్షల నుంచి కోటి రూపాయలకు పైగా ఉన్నాయని సెన్‌హైజర్ ఇండియా సేల్స్ డైరెక్టర్ నవీన్ చెప్పారు. దేశంలో ఆడియో, వీడియో ఉత్పత్తుల పరిశ్రమ యేటా 30-40 శాతం వృద్ధిని నమోదు చేసుకుంటున్నదని, సంఘటిత రంగ సంస్థలు చాలా తక్కువగా ఉన్నాయని, అసంఘటిత రంగ సంస్థలు అత్యధికంగా ఉన్నాయన్నారు.

పడకేసిన పారిశ్రామికోత్పత్తి

అక్టోబర్‌లో 3.5 శాతానికి పరిమితమైన వృద్ధి

న్యూఢిల్లీ, డిసెంబర్ 12: దేశీయ పారిశ్రామిక రంగం మళ్లీ పడకేసింది. గనులు, విద్యుత్, తయారీ రంగాలు నిరాశాజనక పనితీరు కనబర్చడంతో అక్టోబర్ నెలలో పారిశ్రామిక వృద్ధి 3.5 శాతానికి పరిమితమైంది. క్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన 11.9 శాతంతో పోలిస్తే భారీగా తగ్గినట్లు కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. దేశవ్యాప్తంగా గనుల్లో ఉత్పత్తి గణనీయంగా పడిపోవడంతో మొత్తం పారిశ్రామిక ప్రగతిపై ప్రతికూల ప్రభావం చూపింది. క్రితం ఏడాది ఇదే నెలలో 13.1 శాతం వృద్ధిని నమోదు చేసుకున్న గనుల రంగం అక్టోబర్ నెలకుగాను 0.9 శాతానికి పరిమితమైంది. అలాగే తయారీ రంగం కూడా 10.6 శాతం నుంచి 4.1 శాతానికి పరిమితమైంది. దీంతోపాటు విద్యుత్ ఉత్పత్తి కూడా 20.4 శాతం నుంచి 2 శాతానికి పడిపోయింది. 2023 అక్టోబర్ నెలలో 21.7 శాతం వృద్ధిని నమోదు చేసుకున్న క్యాపిటల్ గూడ్స్ రంగం ఈసారికిగాను 3.1 శాతానికి పరిమితమైంది. కన్జ్యూమర్ నాన్-డ్యూరబుల్ రంగ వృద్ధి 2.7 శాతానికి పరిమితమైంది. క్రితం ఏడాది ఇది 9.3 శాతంగా నమోదైంది. కానీ, వినియోగదారుల మన్నికైన వస్తువుల ఉత్పత్తి విభాగం 5.9 శాతం వృద్ధిని కనబరిచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-అక్టోబర్ మధ్య కాలంలో పారిశ్రామిక వృద్ధి 4 శాతంగా నమోదైంది. క్రితం ఏడాది ఇది 7 శాతంగా ఉన్నది.

శాంతించిన ధరల సూచీ

గత కొన్ని నెలలుగా రికార్డు స్థాయిలో దూసుకుపోయిన ధరల సూచీ ఎట్టకేలకు శాంతించింది. నవంబర్ నెలకుగాను రిటైల్ ద్రవ్యోల్బణం 5.48 శాతంగా నమోదైంది. అక్టోబర్ నెలలో నమోదైన 6.21 శాతంతో పోలిస్తే తగ్గుముఖం పట్టింది. ఆహార పదార్థాలు తగ్గుముఖం పట్టడం, ముఖ్యంగా కూరగాయలు చౌక కావడం వల్లనే రిటైల్ ధరల సూచీ తగ్గుముఖం పట్టిందని కేంద్రం తాజాగా వెల్లడించింది. ఆహార పదార్థాల ధరల సూచీ 9.04 శాతానికి తగ్గింది. క్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన 8.70 శాతంతో పోలిస్తే పెరగగా, అక్టోబర్‌లో నమోదైన 10.87 శాతంతో పోలిస్తే భారీగా తగ్గింది.

కాగజ్‌నగర్‌లో టైగర్ కారిడార్

- ప్రణాళికలను సిద్ధం చేస్తున్న అటవీశాఖ
- కవ్వాల్‌లో ఫలించని ప్రయత్నాలు
- కాగజ్‌నగర్‌లో పర్యటించిన పీసీసీఎఫ్ ఆర్‌ఎం డోబ్రియాల్
- ఆందోళనలో స్థానిక ప్రజలు, రైతులు

హైదరాబాద్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): కాగజ్‌నగర్ డివిజన్ అడవుల్లో టైగర్ కారిడార్ ఏర్పాటుకు అటవీశాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఆర్‌ఎం డోబ్రియాల్ ఇటీవల జిల్లాలో 3 రోజులపాటు పర్యటించారు. టైగర్ కారిడార్ ప్రతిపాదనను వేగిరం చేస్తుండటంతో స్థానిక గ్రామస్తుల్లో భయం నెలకొన్నది. కాగా, కాగజ్‌నగర్ అడవుల్లో త్వరలో కారిడార్ ఏర్పాటు చేస్తామని డోబ్రియాల్ ప్రకటించినప్పటికీ వివరాలు వెల్లడించలేదు.

కాగజ్‌నగర్ డివిజన్ ఎందుకు?

మహారాష్ట్ర చంద్రాపూర్ జిల్లా తడోబా అంధారి టైగర్ రిజర్వ్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ మధ్య ఉండటంతో కాగజ్‌నగర్ డివిజన్‌లోని అడవులు టైగర్ కారిడార్‌కు సరైన ప్రదేశంగా గుర్తించారు. తడోబా నుంచి వచ్చే పులులను కాగజ్‌నగర్ అడవులు ఆకర్షిస్తున్నాయి. మొదట కవ్వాల్‌లో టైగర్ కారిడార్ ఏర్పాటు చేయగా ఆశించనంతగా ఫలితాలు సాధించలేదు. పునరావాస ప్యాకేజీలు సుమారు రూ.50 కోట్లు నిధులు వెచ్చించినప్పటికీ, కవ్వాల్ పులులకు నిలయంగా మారలేకపోయింది. ఇదిలా ఉండగా, టైగర్ కారిడార్ ఏర్పాటుతో స్థానికుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. అడవుల్లోకి రానివ్వకుండా ఆంక్షలు విధిస్తారేమోనని, దీంతో జీవనోపాధి దెబ్బతింటుందని అనుమానం వ్యక్తంచేస్తున్నారు. కారిడార్ ఏర్పాటుకు వ్యతిరేకంగా నిరసన చేపట్టాలని యోచిస్తున్నారు.

ఇల్లు కూల్చేస్తరేమోనని ఆటోడ్రైవర్ మృతి

- మూసీ బఫర్‌జోన్‌లో కూల్చివేతలంటూ ప్రచారం
- ఆందోళనకు గురై గుండెపోటుతో రవీందర్ హఠన్మరణం
- రామంతాపూర్‌లో విషాదం

ఉప్పల్, డిసెంబర్ 12 : మూసీ పరిసర ప్రాంత ప్రజల్లో మళ్లీ భయం మొదలైంది. బఫర్ జోన్‌లో ఉన్నాయంటూ ఇండ్లను కూల్చివేస్తారని జరుగుతోన్న ప్రచారం పేదల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నది. పైసా పైసా కూడబెట్టుకొని కట్టుకున్న ఇండ్లను కండ్లముందే కూల్చివేస్తారేమోనని ఆందోళనకు గురవుతున్నారు. తాజాగా తన ఇంటిని కూల్చివేస్తారని దిగులు చెందిన ఆటోడ్రైవర్ గుండెపోటుతో మృతి చెందిన ఘటన రామంతాపూర్‌లో చోటు చేసుకున్నది. బాధితుల కథనం ప్రకారం.. రామంతాపూర్ లక్ష్మీనారాయణకాలనీకి చెందిన రవీందర్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మూసీ కూల్చివేతల్లో భాగంగా తమ ఇంటిని కోల్పోతామని కొద్దిరోజులుగా దిగాలుగా ఉన్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు. రోజూ మాదిరిగానే గురువారం నాగోల్ నుంచి ఇంటికి వస్తుండగా గుండెపోటు రావడంతో రవీందర్ మృతిచెందాడు. తన ఇంటిని కూల్చివేస్తారనే ఆవేదనతోనే మరణించినట్టు కుటుంబసభ్యులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గుండెపోటుతో రవీందర్ మృతి చెందిన విషయం సోషల్ మీడియాతోపాటు స్థానిక గ్రూపుల్లో విస్తృతంగా ప్రచారం జరుగుతున్నది.

పేదల్లో భయం..భయం

మూసీ బఫర్‌జోన్‌లో కాలనీలు ఉన్నాయంటూ ఇండ్లను కూల్చివేస్తారనే ప్రచారం జరుగుతున్నది. దీంతో పేదల్లో భయం పట్టుకున్నది. ఇన్నాళ్లూ కష్టపడి కట్టుకున్న ఇండ్లను కూల్చివేస్తే తాము ఎక్కడికి వెళ్లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కాగా, గతంలో బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు పాదయాత్రలు చేపట్టి, ఈ కాలనీవాసులకు భరోసాను కల్పించిన విషయం తెలిసిందే. రవీందర్ మృతితో ఇండ్లు కూల్చివేస్తారనే అంశం మళ్లీ తెరపైకి రావడంతో కాలనీవాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

'ఆర్టీసీ'రిమూవల్ పరిష్కారానికి కమిటీ

- ముగ్గురు సభ్యులతో ఏర్పాటు
- కార్మికుల పోరాటానికి తలొగ్గిన సర్కారు

హైదరాబాద్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీ కార్మికుల పోరాటానికి సర్కారు దిగివచ్చింది. సర్వీస్ రిమూవల్ కేసుల పరిష్కారానికి త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీ చైర్మన్‌గా కార్మిక, ఉపాధి కల్పనా శాఖ ముఖ్య కార్యదర్శి సంజయ్ కుమార్, కన్వీనర్‌గా ఆర్టీసీ ఎండీ సజ్జనార్, సభ్యురాలిగా సెర్ప్ సీఈవో, ప్రజావాణి నోడల్ ఆఫీసర్ దివ్యను నియమించింది. ప్రజావాణిలో ఆర్టీసీకి సంబంధించిన సర్వీస్ రిమూవల్ కేసుల విషయమై ఫిర్యాదులను ఈ కమిటీ పిలిచి సమీక్షించనున్నది.

సమస్యలను పరిష్కరించాలి

ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీని స్వాగతిస్తున్నట్టు ఆర్టీసీ జేఏసీ వైస్‌చైర్మన్, టీఎంయూ ప్రధాన కార్యదర్శి థామస్‌రెడ్డి తెలిపారు. మహాలక్ష్మి పథకం తర్వాత అధికారులు తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో దాదాపు 300 మంది డ్రైవర్లు, కండక్టర్లు, సూపర్‌వైజర్లు, మెయింటెనెన్స్ ఉద్యోగులు సర్వీస్ నుంచి రిమూవల్ అయ్యారని పేర్కొన్నారు. కమిటీ తూతూ మంత్రంగా కాకుండా, మానవతా దృక్పథంతో న్యాయం చేయాలని థామస్‌రెడ్డి కోరారు.

ఆర్టీసీ ఉద్యోగుల సర్వీస్ వివాదాలకు పరిష్కారం: మంత్రి పొన్నం

ఆర్టీసీ ఉద్యోగుల్లో సర్వీస్ నిమిత్తం కేసుల పరిష్కారానికి కమిటీ ఏర్పాటు చేసినట్టు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. కమిటీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని, క్రమశిక్షణతో పనిచేయాలని పేర్కొన్నారు.

భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలం నారాయణపురంలో రాస్తారోకో చేస్తున్న రైతులు

కొర్రీలు పెట్టకుండా ధాన్యం కొనాలి

నారాయణపురంలో రైతుల రాస్తారోకో • తహసీల్దార్ హామీతో ఆందోళన విరమణ

అశ్వారావుపేట, డిసెంబర్ 12 : కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి షరతులు, కొర్రీలు పెట్టకుండా ధాన్యం కొనుగోలు చేయాలనే డిమాండ్‌తో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం నారాయణపురం ప్రధాన రహదారిపై గురువారం రైతులు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సొసైటీ పరిధిలో పట్టాలు లేని భూముల్లో పండించిన ధాన్యం కొనుగోలు చేయడం సాధ్యం కాదని అధికారులు చెబుతున్నారని, గత్యంతరం లేక ఆందోళనకు దిగినట్టు తెలిపారు. ఏజెన్సీలో పట్టాలు పొందడానికి ఇబ్బందులు ఉన్నాయని, 4సీ పట్టా భూముల్లో ధాన్యం పండిస్తే కొనుగోలుకు అధికారులు నిరాకరిస్తున్నారని రైతులు మల్లేశ్వరరావు, లక్ష్మీనర్సయ్య, గంగరాజు, కుమారస్వామి, దుర్గారావు ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు చేసిన అధికారులకు ఇప్పుడు ఏమైందని ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ.. ఘటనా స్థలానికి వెళ్లి సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ పీ కృష్ణప్రసాద్ నారాయణపురం కొనుగోలు కేంద్రానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. పట్టాలు లేకపోయినా ధాన్యం కొనుగోలు చేస్తామని, ఆధార్ కార్డు లేదా భూమి వివరాల ఆధారంగా ధాన్యం తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

సిరిసిల్లలో బీసీ స్టడీ సర్కిల్‌కు రూ.5కోట్లు

హైదరాబాద్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బీసీ స్టడీ సర్కిల్ భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.5కోట్లతో పరిపాలన అనుమతులను మంజూరు చేసింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. స్టడీ సర్కిల్ నిర్మాణానికి తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించింది.

రాజమండ్రి టు ఢిల్లీకి డైరెక్ట్ ఫ్లైట్

- ప్రారంభమైన విమాన సర్వీసులు
- ఢిల్లీ నుంచి మధురపూడి చేరుకున్న తొలి ఎయిర్‌బస్

హైదరాబాద్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి నుంచి నేరుగా ఢిల్లీ, ముంబై వెళ్లే విమాన సర్వీసులు గురువారం ప్రారంభమయ్యాయి. అంతకుముందు ఢిల్లీ నుంచి రాజమండ్రి మధురపూడి ఎయిర్‌పోర్టుకు తొలిసారిగా వచ్చిన ఇండిగో ఎయిర్‌బస్‌లో కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎంపీ పురందేశ్వరి ప్రయాణించారు. ఈ సందర్భంగా విమానానికి వాటర్ కెనాన్లతో సిబ్బంది స్వాగతం పలికారు. కేంద్ర మంత్రి మాట్లాడుతూ ఇంతకుముందు ఢిల్లీ, విదేశాలకు వెళ్లాలంటే విజయవాడ, విశాఖ, హైదరాబాద్‌కు వెళ్లాల్సి వచ్చేదని పేర్కొన్నారు. ఇకపై ముంబై, ఢిల్లీకి వెళ్లి అక్కడి నుంచి విదేశాలకు వెళ్లొచ్చని తెలిపారు. భవిష్యత్తులోనూ తిరుపతి, షిర్డీ, జైపూర్, గుజరాత్ రాష్ట్రాలతోపాటు ప్రధాన నగరాలకు బిజినెస్ కనెక్టివిటీని పెంచేందుకు అవకాశమున్నట్టు పేర్కొన్నారు.

కుట్టుమిషన్ల కోసం దరఖాస్తులు

హైదరాబాద్, డిసెంబర్12 (నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ మహిళా శక్తి పథకం కింద అందించనున్న కుట్టుమిషన్ల కోసం మైనార్టీ మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్(టీజీఎంఎఫ్‌సీ) చైర్మన్ మహ్మద్ ఒబేదుల్లా గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. కుట్టుమిషన్ల కోసం మైనార్టీ మహిళలు www. tgobmms. cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తు ఫారంతోపాటు ధ్రువపత్రాల సెట్‌ను 31లోగా కార్యాలయాల్లో అందించాలని కోరారు.

హైడ్రాతో చెడ్డపేరు: మంత్రి దుద్దిళ్ల

హైదరాబాద్, డిసెంబర్12 (నమస్తే తెలంగాణ): హైడ్రా వల్ల తమ ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చిందని, దానిని సరిచేసుకోవాల్సి ఉన్నదని ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టంచేశారు. ఒక టీవీ చానల్ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ.. హైడ్రా రాగానే కొంతమంది అధికారులు అత్యుత్సాహంతో పనిచేశారని, దానివల్ల తమకు, ప్రభుత్వానికి ఇబ్బంది వచ్చిందని, ఆ విధంగా జరగకూడదని పేర్కొన్నారు. సామాన్యులకు ఎలాంటి ఇబ్బందులు రాకూడని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఆదేశాలు లేకుండా అధికారులు అలా ఎలా చేస్తారని మీడియా ప్రతినిధి ప్రశ్నించగా, కొందరు చేస్తారంటూ మంత్రి జవాబిచ్చారు. మంత్రి దుద్దిళ్ల వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

ప్రభుత్వానికి టీఈజేఏసీ విజ్ఞప్తి

హైదరాబాద్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించి రూ.10 లక్షల లోపు ఉన్న జీపీఎఫ్‌తోపాటు లీవ్స్, సరెండర్ లీవ్స్ సాలరీ, ఏరియర్స్, మెడికల్ రీయింబర్స్‌మెంట్, అద్దె వాహనాల చార్జీలు, ఎన్నికల బిల్లులను మంజూరు చేయాలని ఉద్యోగుల జేఏసీ ప్రభుత్వాన్ని కోరింది. జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి బృందం సీఎం సలహాదారు నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేసింది. వేతన బిల్లులకు ట్రెజరీ, అకౌంట్స్ కార్యాలయాల ఆమోదం లభించినప్పటికీ ఈ-కుబేర్‌లో పెండింగ్ ఉన్నట్టు పేర్కొన్నారు. రెవెన్యూ ఉద్యోగుల పెండింగ్ బిల్లులు సైతం మంజూరు చేయాలని కోరారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని నరేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నేతలు రామకృష్ణ, రాములు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమల, తిరుపతిలో కుండపోత

హైదరాబాద్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): తిరుమల, తిరుపతిలో గురువారం భారీ వర్షం కురిసింది. చలి తీవ్రత కూడా పెరగడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. ఘాట్ రోడ్లపై వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాలని అధికారులు సూచించారు. పాప వినాశనం, శ్రీవారి పాదాలకు వెళ్లే మార్గాలను మూసివేశారు. గోగర్భం, పాప వినాశం పూర్తిగా నిండిపోయింది. తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతున్నది. భక్తులు 15 కంపార్టుమెంట్లలో వేచి ఉన్నారు. టోకెన్లు లేని వారికి ఆరు గంటల్లో సర్వదర్శనం కలిగిందని అధికారులు వెల్లడించారు. బుధవారం స్వామివారిని 65,887 మంది భక్తులు దర్శించుకోగా.. కానుకల ద్వారా హుండీకి రూ. 3.88 కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. తిరుపతిలోని శ్రీ గోవిందరాజ స్వామివారి ఆలయంలో నేడు తిరుమంగై ఆళ్వార్ సాత్తుమొర జరుగనున్నది. ఈ నెల 4 నుంచి తిరుమంగై ఆళ్వార్ ఉత్సవం కొనసాగుతుండగా, సాత్తుమొర సందర్భంగా 13న సాయంత్రం 5.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామి, తిరుమంగై ఆళ్వార్ ఆలయ మాడవీధుల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

రోజుకు 2 లక్షలు జేబులో పడాల్సిందే!

- ఒక్కో సంతకానికి లక్షలు వసూలు
- ఏసీబీ విచారణలో ఏఈఈ నికేశ్‌కుమార్
- మొదటి రోజు పొడిపొడిగా మాట్లాడిన నికేశ్

హైదరాబాద్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): ఆదాయానికి మించిన అక్రమాస్తుల కేసులో ఏసీబీకి పట్టుబడిన నికేశ్‌కుమార్ సంతకం ఖరీదు లక్షల రూపాయలు అని ఏసీబీ అధికారులు చెబుతున్నారు. అతను రోజుకు కనీసం 2 లక్షల రూపాయలు లంచంగా ఇంటికి తీసుకెళ్లాలని టార్గెట్‌గా పెట్టుకున్నట్టు తెలిసింది. నీటిపారుదలశాఖ ఏఈఈగా అక్రమాలకు పాల్పడిన నికేశ్‌కుమార్‌ను విచారించేందుకు గురువారం నాలుగు రోజుల కస్టడీకి తీసుకున్న ఏసీబీ అధికారులు చంచల్‌గూడ జైలు నుంచి నాంపల్లి ఏసీబీ కార్యాలయానికి తరలించారు. మొదటిరోజు విచారణలో ఏసీబీ అధికారుల ప్రశ్నలకు నికేశ్ పొడిపొడిగానే సమాధానాలు చెప్పినట్టు తెలిసింది. ఇప్పటికే నికేశ్ స్నేహితుల బ్యాంక్ లాకర్ల నుంచి బంగారం, కీలక పత్రాలు స్వాధీనం చేసుకోగా గురువారం నికేశ్ సమక్షంలోనూ పలువురు బినామీల బ్యాంకు లాకర్లు తెరిచినట్టు సమాచారం. నికేశ్ కేసులో ఏసీబీ అధికారులు ఇప్పటికే రూ.17.73 కోట్ల అక్రమాస్తులను గుర్తించారు. వీటి మార్కెట్ విలువ వందల కోట్ల రూపాయలు ఉంటుందని అంచనా వేస్తున్నారు. నికేశ్ వెనుకాల ఎవరైనా ఉన్నారా? అతడు ఎవరికైనా బినామీగా ఉన్నాడా అనే కోణంలోనూ దర్యాప్తు సాగుతున్నట్టు తెలుస్తున్నది.

• దళితబంధు కోసం పోస్టుకార్డు ఉద్యమం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారంలో దళితబంధు సాధన కోసం గురువారం పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. దళితబంధు సాధన సమితి జిల్లా అధ్యక్షుడు సంపత్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, కలెక్టర్ రాహుల్‌శర్మకు రాసిన ఉత్తరాలను పోస్ట్‌బాక్స్‌లో వేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కేటాయించి ఫ్రీజ్ చేసిన రెండో విడత దళితబంధు నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

- కాటారం